అనువాద సాహిత్యము

బల్గేరియన్ కథానిక

# క్షణకాలము స్వేచ్ఛ

రచన: వైలో పెట్రోవ్

[మానవుడు స్వేచ్ఛాజీవి. స్వేచ్ఛలేని జీవితము నిరర్థకము. విప్లవకారులకు సహాయం చేశాడని అతన్ని నరకంలాంటి కాన్సెంట్రేషన్ క్యాంపులో వుంచారు. వుంచి ఎన్ని సంవత్సరాలు గడచిందో... చివరకు ముసలితనము మృత్యుముఖంలోకి తీసుకు వెడుతుండగా అతనిని విడుదలకు ఉత్తర్వులు వచ్చాయి. రాబోయే స్వేచ్ఛకు పులకించాడు. తన వారిని కలుసుకోవచ్చని ఆనందించాడు— కానీ అతనికి స్వేచ్ఛ లభించింది ఒక నిముషముపాటే— తిర్వాత శాశ్వతమైన స్వేచ్ఛ లభించింది]

జైలు గార్డు ఖైదీల నుంచిన బ్యారకు దగ్గరకు వచ్చి "ఏయ్ ముసలోడా! నిన్ను విడుదల చేస్తున్నాం" అని అన్నాడు.

"ఏమిటి, ఎం?" అని తెల్లబోతూ ముసలి వ్యక్తి అడిగాడు.

"అరే నీకే చెప్పేది. నిన్ను విడుదల చేస్తున్నాం! లే! లే! మూటా ముల్లె సర్దుకో!" అని గార్డు మరల హెచ్చరించాడు.

అతనిని విడుదల చేయమని పంపిన ఉత్తర్వు ఒకరి చేతుల్లోంచి మరొకరి చేతుల్లోకి నడచిపోయింది. అటుఇటూ తత్తర చూపులు చూస్తూ ఆ ముసలి తాత అక్కడనే కూలబడిపోయాడు. అందరి దృక్కులు చెమటతో నిండివున్న అతని ముఖం వైపు సారించబడ్డాయి. ఒకరొకరు ఒక్కొక్క భావనలో మునిగి తేలుతున్నారు. ఆ ఉత్తరువును చూచినవాళ్ళు వాళ్ళ కళ్ళను వాళ్ళే నమ్మలేకపోతున్నారు. తామంతా ఆ నికృష్టపు జీవితం గడుపుతూ, ఆ ఒక్క ముసలి తాత మాత్రం విడుదల చేయబడటం మూలంగా కొందరిలో ఈర్ష్య, ద్వేషం తలెత్తింది. ముసలి తాతకు ఇదంతా చూచేటప్పటికి గుక్క తిప్పుకోలేనంత పనయింది. మొదలనుండా కూర్చొని తానంతకుముందు సృష్టించిన ఒక బఫూన్ బొమ్మనాడిస్తూ ఏదో ఆలోచిస్తున్నాడు. తనకున్న విరామకాలంలో తన మనుమల కోసం ఆ ముసలితాత పూరికేనే కూర్చొనక చిన్న చిన్న బొమ్మలను చేస్తూవుంటాడు.

"తాతా! యింకా ఎందుకు కూర్చుంటావు? అన్నీ సర్దుకొని బయటపడు." అని వారిలో ఒకరన్నారు.

"దేవుడు నీకు తోడునీడగుగాక!" అని మరొకరన్నారు.

వీరందరి ప్రోత్సాహానికి తాత కెంతో సంతోషం కలిగింది. చిన్న పిల్లాడిలా కేరింతాలు కొడుతూ తనకున్న నాలుగు సామానులూ సర్దుకోవటం మొదలెట్టాడు. తనకున్న చలికోటును, మేజోళ్ళను, అలాగే పగ్గను, అక్కడి వాళ్లకు యిచ్చివేసి, అందరికీ నమస్కారాలు చెప్పి వారి వీడ్కోలుతో బయటకు ప్రయాణమయ్యాడు. పిల్లల కొరకు తయారు చేసిన బొమ్మలను భద్రంగా మూటగట్టి, దానినెంతో జాగ్రత్తగా చంకకు తగిలించుకు ఒక్క చొక్కాతో బయటపడ్డాడు కాళ్లకు కనీసం చెప్పులైనా లేవు. ఆ ముసలి తాత ఆ యమలోకపు కవాటాలను దాటి బయట పడేటప్పుడు ఆ పెద్ద గేటు దగ్గర నిలబడి గార్డుకు ఎంతో ఉత్సాహంతో శాల్యూట్ చేశాడు. దానికి ప్రతిగా "గుడ్‌బై, సార్!" అని అన్నాడు ఆ గార్డు (కావలాదారు), మీసాలను సరిచేసుకుంటూ ఆ గార్డు సిగరెట్ వెలిగించి అన్నాడు గదా: "ఇదంతా తమాషా కమాండెంటు తప్ప తాగి యీ ముసలిముండాకొడుకును వేళాకోళం చేస్తున్నాడు. — ఏయ్ ముసలి తాతా! వెనక్కు తిరిగిరా! నిన్ను వాళ్ళు పిచ్చి వుల్లాయని చేయడానికిగాను ఇదంతా చేస్తున్నారు."

ఈమాటలు వినబడు ముసలితాత పట్టించుకోలా. ఇపుడు తనను ఆపగలిగిన మగవాడెవడూ లేడు. తాను స్వేచ్ఛాప్రపంచంలో నున్నాడాయెను. వెనుదిరిగి వెళ్ళి మరల ఆ యమలోకం చేరడమా– అది అసంభవమైన విషయం. అతని దృష్టి యావత్తూ దూరాన కనిపించే నీలి కొండలవైపె వుంది. అదిగో ఆ కొండల వెనుక సూర్యభగవానుడు తన యింటికి చేరుతున్నాడు. అదే ఆ కొండ వెనుకనే తన గ్రామమున్నది. తన కోసం తన ముసలిది తన యిద్దరు మనుమలు ఎదురు చూస్తుంటారు. వడివడిగా నడచిపోవాలి, అని అనుకుంటున్న వ్యక్తి వెనక్కు తిరిగి వెళ్లవలసి వుంటుందని ఎవరు అనుకుంటారు?

ఆ జైలు బయట ప్రాకారం దాటవలసి వుంది డ్యూటీలో వున్న పోలీసు విడుదల వుత్తర్వు పరీక్ష చేయాలన్నాడు. ముసలి తాత చంకనున్న మూటను దింపి ఆ వుత్తర్వు నందించాడు. ఆ వుత్తరువును ఒకటికి రెండుసార్లు మరీ చదివి, ఆ గార్డు గేటును తెరిచాడు ముసలి తాతకు శాల్యూట్ చేశాడు. తాత ఆ మూటను మరల చంకను తగిలించుకున్నాడు

(తరువాయి 22 వ పేజీ)

# ది మచిలీపట్టణము కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్ నెం. 4783

## మచిలీపట్టణము

స్థాపితం 4—3—1920 ★ ఫోను నెం 114

**45 సం॥ నుండి ప్రజాసేవ చేయుచున్న సహకార సంస్థ**

46 వ జన్మదిన సందర్భమున బాదకు పుర ప్రజలకు, మెంబర్లకు, ఖాతాదారులకు, అభిమానులకు, సహకారులకు శుభాకాంక్షలతో సమర్పించు ది 24-2-65 నుండి అమలులోనికి వచ్చిన వడ్డీరేట్లు :

ది 31-12-64 వ తేదీకి బ్యాంకు

| ఫిక్సెడ్ డిపాజిట్టులు | | | ఆస్థి అప్పుల వివరములు | |
|---|---|---|---|---|
| 6 | నెలలకు | 6% | షేరు ధనము | 1,66,660-00 |
| 12 | ,, | 6½% | ఫిక్సెడ్ డిపాజిట్టులు | 6,60,312-87 |
| 24 | ,, | 6¾% | సేవింగ్సు డిపాజిట్టులు | 1,55,408-62 |
| 36 | ,, | 7% | ఇతర డిపాజిట్టులు | 22,946-85 |
| | అంతకు పైన | | వ్యాపార ధనము | 10,63,771-01 |
| | | | బ్యాంకు భవనములు | 23,255-00 |
| సేవింగ్సు డిపాజిట్టులు | | 4% | బ్యాంకు ఇచ్చిన అప్పులు | 9,93,400-44 |
| కరెంటు డిపాజిట్టులు | | 1% | బ్యాంకు రిజర్వులు | 31,768-02 |
| | | | క్షేమనిధి | 30,094-67 |

**రికరింగు డిపాజిట్టులు ఆకర్షణీయమైన రేట్లతో అనుమతించబడును.**

**30—6—64** సంవత్సరమునకు నికర లాభం రు **16,000/-** పైగా

బోర్డు అనుమతిని :

| శేడింబి శ్రీనివాసరావు | డి. పురుషోత్తం | వి. ఉదయ భీమరాజు |
|---|---|---|
| *B.A., B.L.,* | *B.Com ,* | *B.A.,B.L.,* |
| గౌ॥ఉపాధ్యక్షులు | కార్యదర్శి | గౌ॥అధ్యక్షులు |


## క్షణకాలము స్వేచ్ఛ

(11 వ పేజి తరువాయి)

ముందున్న ప్రపంచమంతా అనదేనస్పష్టంగా స్వేచ్ఛావాయువులను పీలుస్తూ, ముసలితాత గబగబా నడుస్తున్నాడు. తన ప్రపంచం చేరడానికి. అలా నాలుగడుగులు వేశాడో లేదో ఎవరో యిద్దరు పోలీసులు వచ్చి వెనుకనుండి అతని రెండు రెక్కలను గట్టిగా పట్టేశారు. వారిలో ఒకడు ముద్దుమొఖం కలిగివున్నాడు వాడు ఆ ముసలితాత దండాన్ని గట్టిగా లాగి వికటాట్టహాసం చేశాడు.

ఏయ్!మూగ పీనుగా! ఎక్కడికి పోతావ్! యమకూపంలాంటి ఈ కాన్సంట్రేషన్‌కాంపు నుండి బయటపడటం అంత తేలికనుకున్నావా? విప్లవ కారులకు సహాయం చేసిన నిన్ను అంత తేలికగా వదిలిపెట్టటమే! వదిలిపెడితే మళ్ళీ వాళ్లల్లో చేరిపోతావు- ఎంత అయోమయపు మనిషివి నువ్వు? పదపద అని ఆ పోలీసు ముసలితాత రెక్కను పట్టి తోశాడు.

“ఇదిగో విడుదల వుత్తరువు-నేనేమి దొంగతనంగా పారిపోవడంలేదు.” అని తన చేతులోనున్న ఉత్తరువును ఆ పోలీసు కళ్లముందు అటూ ఇటూ వూపాడు. “నేను పెద్దకమాండెంటును చూస్తాను- ఇది మరీ అన్యాయం.” అని ఆ ముసలితాత గొడవ పెడుతూండగానే ఆ దుక్కలాటి పోలీసు ఆ వుత్తరువును గభాలున లాక్కొని పరపర చింపివేశాడు. ఆ ముసలితాత ఆతర్వాత ఒక్క మాటా మాట్లాడటా–– వెనక్కు తిరిగి మెల్లమెల్లగా అడుగులో అడుగు వేసుకుంటూ ఆ జైలువైపు నడుస్తున్నాడు. ఆ సాయంకాలపుటెండలో అతని నీడ పొడవుగా అస్పష్టంగా తన ముందు కనిపిస్తోంటే దానివైపే చూచుకుంటూ నడుస్తున్నాడు. ఆ జైలు ప్రాంగణంలోకి వచ్చిన తర్వాత తన గుండె మీద చేయి వేసి చూసుకున్నాడు- అంతే- చంకనున్న బొమ్మలమూట ఒరిగి క్రిందికి జారి పడిపోయింది. దానిని మరల లేవనెత్తుకొనడానికి ముందుకు ఒంగాడు- అంతే- అలాగే ఒరిగిపోయాడు - మరల లేవనేలేదు—ఆ ముసలితాత!

అలా ముసలితాత శవం అక్కడ ఎంతోసేపు పడేసి వుంచారు -- మేమంతా అశ్రుతర్పణ చేశాం . రౌకసారి— మరొక మానవుని ఆశను ఖూనీ చేశారు ఆ దుండగులు.